క్లుప్తంగా

నేడు కంది విత్తనాల పంపిణీ

మానవపాడు: మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం కంది విత్తనాలు ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి ప్రదీప్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీఆర్‌జీ–176, 110, ఎల్ఆర్‌జీ– 105, 70, ఎల్ఆర్‌జీ– 52, 375 మొత్తం 555 మినికిట్స్ అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. 100 శాతం సబ్సిడీతో రైతులకు ఉచితంగా అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

రైతుబీమా చెక్కు అందజేత



గట్టు: మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన రైతు వడ్డే బత్తలమ్మ కుటుంబ సభ్యులకు రైతుబీమా ద్వారా మంజూరైన రూ.5 లక్షల చెక్కును సోమవారం మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్ అందజేశారు. వడ్డె బత్తలమ్మ రెండు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా రైతుబీమా ద్వారా మంజూరైన చెక్కును అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మల్లేష్, హనుమంతు, కుర్వ రవీంద్ర, వేమారెడ్డి, జయరామ్‌గౌడ్, ఈరన్న, వడ్డేనాగన్న, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

మానవపాడు: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఐసీడీఎస్, సీడీపీఓ సుజాత అన్నారు. మండల కేంద్రంలో ఇటిక్యాల మండలానికి చెందిన అంగన్‌వాడీ టీచర్లతో సోమవారం సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు క్రమం తప్పకుండా సమయపాలన పాటించాలని సూచించారు. చిన్నారులు వయస్సుకు తగిన ఎత్తు, బరువు ఉండేలా చూసుకోవాలని పేర్కొన్నారు.

మహా పంచాక్షరి నామస్మరణ

మానవపాడు: మండలంలోని చెన్నిపాడు శివాలయంలో సోమవారం మహా పంచాక్షరి నామస్మరణ కార్యక్రమం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నిర్వహించారు. విశ్వ హిందూ పరిషత్ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ఉండవెల్లి: మండలంలోని మారమునగాల, ప్రాగటూరు, శేరుపల్లే గ్రామ శివారులోని కృష్ణానది తీర ప్రాంతాలను సోమవారం ఎస్ఐ శేఖర్ పరిశీలించారు. తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వేట కోసం నదిలోకి వెళ్లవద్దని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి



గట్టు: భూముల వివరాలను రైతులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారి తిరుమలేష్ అన్నారు. సోమవారం ఆరగిద్ద గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను ప్రారంభించారు. సంక్షేమ పథకాల లబ్ధికి పోర్టల్‌లో తప్పని సరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. సుమారు 150 మంది రైతులకు సంబంధించిన భూముల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు ఏఈఓ పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకటేష్, రైతులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

గద్వాల క్రైం: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు పట్టణ ఎస్ఐ కళ్యాణ్‌కుమార్ తెలిపారు. సోమవారం సాయంత్రం మండలంలోని గోనుపాడు గ్రామం నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా రాజీవ్‌మార్గ్‌లో ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ట్రాక్టర్ యాజమాని సత్యం, డ్రైవర్‌పై కేసు నమోదు చేశామన్నారు. అదే విధంగా మద్యం తాగి వాహనాలు నడుపుతున్న నలుగురిని అదుపులోకి తీసుకొని డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

కలగానే వంతెనల నిర్మాణాలు

- ఏళ్ల తరబడి రాకపోకలకు తప్పని తిప్పలు
- అవస్థలు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



బూరెడ్డిపల్లి వద్ద వాగులో వెళ్తున్న కలెక్టర్ శశాంక్(ఫైల్)

ధరూరు: మండల పరిధిలోని ఆయా గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్ల వెంట వాగులు, వంకలపై రాకపోకలు కష్టతరంగా మారుతున్నాయి. దశాబ్దాల తరబడి ఇబ్బందులకు గురవుతున్నట్లు వాహనదారులు వాపోతున్నారు. గతంలో కలెక్టర్, సంబంధిత అధికారులు వాగులను సందర్శించి రోడ్‌కం బ్రిడ్జి నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. అయినా నేటికీ నిర్మాణాల వైపు అడుగు ముందుకు పడలేదు. దీంతో వర్షాకాలంలో తీవ్ర అవస్థలు పడుతున్నట్లు వాహనదారులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మండల పరిధిలో..

గద్వాల– ధరూరు వయా గట్టు మండలానికి వెళ్లే ప్రధాన రోడ్డు వెంట మండల పరిధిలోనే రెండు చోట్ల వాగులు ప్రవహిస్తున్నాయి. ధరూరు నుంచి రెండు కి.మీ దూరంలో ఉన్న బూరెడ్డిపల్లికి వెళ్లే మార్గంలో చిటుకోంబావి వాగు, ఓబులోనిపల్లికి వెళ్లే మార్గం వద్ద వాగులు ప్రవహిస్తున్నాయి. ర్యాలంపాడు రిజర్వాయర్ దిగువ భాగంలో ఉన్న వాగులు ఏటా వర్షపు నీరు, నెట్టెంపాడు జలాలు తోడవుతుండడంతో ఉధృతంగా ప్రవహిస్తాయి. దీంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. అదే విధంగా ధరూరు నుంచి చింతరేవుల మీదుగా జూరాల డ్యామ్‌కు వెళ్లే రోడ్లది ఇదే పరిస్థితి. 8 కి.మీ పరిధిలోనే 3 ప్రధాన వాగులు ఉన్నాయి. వాగు పారుతున్న సమయంలో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు వాపోతున్నారు. ముఖ్యంగా జూరాల ప్రాజెక్టుకు వరద వస్తుండంతో సందర్శనకు వచ్చే కర్ణాటక వాసులు ప్రమాదాల బారిన పడుతున్నట్లు వాపోతున్నారు.



ధరూరు జూరాల డ్యాం వెళ్లే మార్గంలో మన్నాపురం వద్ద ఇలా...

కలెక్టర్ సందర్శించినా కదలిక లేదాయే

గట్టు వెళ్లే మార్గంలో ఉధృతంగా ప్రవహిస్తున్న చిటుకోంబావి వాగును 5 ఏళ్ల క్రితం అప్పటి కలెక్టర్ శశాంక్ సందర్శించి అక్కడి పరిస్థితిని పరిశీలించారు. సంబంధిత అధికారులను రోడ్డు కం ఓవర్ బ్రిడ్జి నిర్మాణంపై దృష్టి సారించాలని ఆదేశించారు. అయినా నేటికీ నిర్మాణ పనులు అడుగు కూడా కదలలేదు. వర్షాకాలం ప్రారంభమైన దృష్ట్యా వాగులపై వంతెనలు నిర్మించి రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అధికారి ఏమన్నారంటే...

వాగులపై వంతెనలకు ప్రజలు అవస్థలు పడుతున్నారని ఆర్‌అండ్‌బీ శాఖ ఏఈఈ పృధ్వీని సాక్షి వివరణ కోరగా.. తాను ఈ మధ్యనే వచ్చానని, కల్వర్టుల కోసం ఎలాంటి ప్రతిపాదనలు పెట్టలేదన్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



చింతరేవుల వద్ద ఇలా...

బ్రిడ్జి నిర్మించాలి



మా గ్రామం నుంచి గట్టుకు వెళ్లే మార్గంలో వానాకాలం వచ్చిందంటే చాలు మా తిప్పలు దేవుడికెరుక. ఏళ్ల తరబడిగా వాగులపై వంతెనలు నిర్మించాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు విన్నవించుకుంటున్నా పట్టించుకోవడం లేదు. బూరెడ్డిపల్లి నుంచి చుట్టూ తిరిగి బిజ్వారం మీదుగా గద్వాలకు వెళ్లాల్సి వస్తోంది. అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలి.

– దేవదాసు, మార్లబీడు

గుంతలతో ఇబ్బందులు



జూరాల ప్రాజెక్ట్ మార్గంలో రోడ్డు మార్గం సరిగా లేదు. దీనికి తోడు వాగుల్లో ఎప్పుడు నీళ్లు పారుతూనే ఉంటాయి. వాగుల వద్ద ఏర్పాటు చేసిన కల్వర్టులపై ఎక్కడ గుంత ఉందో తెలియక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రైతులు, కూలీలు వాగులపై వెళ్లి ప్రమాదాల బారిన పడుతున్నారు.

– అంజి సాగర్, సామాజిక కార్యకర్త, మాల్‌దొడ్డి

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి



పెద్దపాడులో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈఓ రవీంద్రబాబు

ధరూరు: ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని మండల విద్యాధికారి రవీంద్రబాబు అన్నారు. మండల పరిధిలోని పెద్దపాడు, ర్యాలంపాడు యూపీఎస్, మార్లబీడు ఉన్నత పాఠశాలలను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు, హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. అదే విధంగా విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు నాణ్యమైన భోజనం అందించాలని వంట ఏజెన్సీ సభ్యులకు సూచించారు. మార్లబీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నిర్వహిస్తున్న పరీక్షను పరిశీలించారు. కార్యక్రమంలో సీఆర్పీ ఆజంపాష, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయాలి



గద్వాల: జిల్లా కేంద్రంలో జూలై 13, 14న నిర్వహించనున్న ఆవాజ్ రాష్ట్ర మహా సభలను జయప్రదం చేయాలని సంఘ సభ్యుడు నాగర్‌దొడ్డి వెంకట్రాములు కోరారు. సోమవారం మండలంలోని అనంతపురంలో ఆవాజ్ రాష్ట్ర మహసభల కరపత్రం విడుదల చేశారు. కార్యక్రమంలో ఆవాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అతికూర్ రెహమాన్, మొహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

రహదారులను ఛిద్రం చేస్తున్నారు



మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

అయిజ: అనుమతులు లేకుండా భారీ వాహనాలను ప్రధాన రోడ్లపై తిప్పి రహదారులను ఛిద్రం చేస్తున్నారని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా అక్రమంగా ఇసుక, ఎర్రమట్టిని పరిమితికి మించి భారీ వాహనాల్లో తరలిస్తుండడంతో రహదారులు, వంతెనలు సర్వనాశనం అవుతున్నాయని మండిపడ్డారు. ముఖ్యంగా కర్నూలు– రాయచూర్, గద్వాల– ఎమ్మిగనూరు రహదారులు శిథిలమై ప్రయాణానికి పనికి రాకుండా తయారయ్యాయని వాపోయారు. సుమారు 80 శాతం వాహనాలు అనుమతులు లేకుండా, అక్రమంగా స్థాయిని మించిన లోడుతో వెళ్తున్నాయని మండిపడ్డారు. అలంపూర్ మండలంలోని రేలంపాడు గ్రామంలో 29, 30 సర్వే నంబర్లలోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని ఆరోపించారు. జోగుళాంబ గద్వాల జిల్లా వాసి శ్రీనివాసరెడ్డి విజిలెన్స్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ ఆఫ్ జనరల్‌గా ఉన్నారని, ఇక్కడి పరిస్థితులను తెలుసుకొని చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు భగత్‌రెడ్డి, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాదన్న, ఓబుల్‌రెడ్డి, వీరేష్‌గౌడ్, వెంకటేష్, రాజశేఖర్, నరసింహులు, రాజు, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి



రాజోళి: ఓవర్సీస్ విద్యార్థులు స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హలీంబాషా అన్నారు. సోమవారం శాంతినగర్‌లోని ఎల్ఎన్ఆర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డొనేషన్లు వసూలు చేస్తున్న ఇంజినీరింగ్ కాలేజీలపై చర్యలు తీసుకోవాలన్నారు. విద్యా రంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. జూలై 2, 3, 4 తేదీల్లో విద్యా సంస్థలు బంద్ పాటించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జెండా తొలగించిన వారిపై చర్య తీసుకోవాలి



ఎస్ఐకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఎర్రవల్లి: బీజేపీ జెండాను తొలగించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. సోమవారం పార్టీ నాయకులతో కలిసి ఆయన కోదండాపురం పీఎస్‌లో ఎస్ఐ మురళికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ.. బీజేపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వేములలో పార్టీ మండలాధ్యక్షుడు జగదీష్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ జెండాను ఆవిష్కరించినట్లు తెలిపారు. గుర్తు తెలియని దుండగులు రెండు రోజుల క్రితం అట్టి జెండాను తొలగించినట్లు పేర్కొన్నారు. ఇట్టి చర్యకు పాల్పడిన దుండగులను వెంటనే గుర్తించి వారిపై కఠిన చర్య తీసుకోవాలని వినతిలో పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు రవి, మల్లేష్, విజయ్, పరుశరాం, శివరాంరెడ్డి, మహేష్, జనార్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల యజమానిపై చర్య తీసుకోవాలి



గద్వాల: అయిజ పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాల యజమాని మధుసూదన్‌రెడ్డి విద్యార్థి సంఘాల నాయకులపై దాడులకు ప్రేరేపించారని ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్వీ నాయకుడు కుర్వ పల్లయ్య కలెక్టర్ బీఎం సంతోష్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు పాఠశాలలో పుస్తకాలు, డ్రెస్సులు విక్రయిస్తున్న విషయాన్ని ప్రశ్నిస్తే మధుసూదన్‌రెడ్డి దౌర్జన్యానికి దిగారని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రవీణ్, చాంద్‌పాష, తిరుమలేష్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధిలో భాగస్వామ్యమయ్యారు



చంద్రయ్య ఆచారిని సత్కరిస్తున్న ఆలయ అర్చకులు, ఉద్యోగులు

అలంపూర్: అలంపూర్ క్షేత్ర ఆలయాల అభివృద్ధిలో ఉద్యోగిగా చంద్రయ్య ఆచారి కీలక భాగస్వామ్యం ఉందని ఈఓ పురేందర్‌కుమార్ అన్నారు. అలంపూర్ క్షేత్రంలోని బాలబ్రహ్మేశ్వర జోగుళాంబ అమ్మవారి ఆలయ సముదాయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న చంద్రయ్య ఆచారి(శేఖర్) పదవీ విరమణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఆలయ ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆలయ చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, దేవదాయ శాఖ ఉద్యగ సంఘం నాయకులు, మాజీ చైర్మన్లు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రయ్య ఆచారి, ఆయన సతీమణిని శాలువా పూలమాలలతో సత్కరించి అమ్మవారు, స్వామి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ మంజుల, ఈఓ ప్రేమ్‌కుమార్, నారాయణరెడ్డి, బాలకృష్ణారెడ్డి, చిన్నకృష్ణయ్య నాయుడు, రవిప్రకాష్‌గౌడ్, గురురాజ, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

రెండు వర్గాల మధ్య ఘర్షణ



గాయపడిన కరుణాకర్

మల్దకల్: మండలంలోని కుర్తిరావల్‌చెర్వు గ్రామంలో రెండు వర్గాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరు గాయపడిన ఘటన సోమవారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన ఒక వర్గం కాంగ్రెస్ కార్యకర్తలు నర్సింహారెడ్డి, వెంకటేష్‌గౌడ్, గోపి, నాగన్నతో పాటు మరికొందరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి తిరుమలేష్‌తో ఓ కేసు విషయమై మాట్లాడుతుండగా, మరో వర్గానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త కరుణాకర్‌తో పాటు మరికొందరు అక్కడికి వెళ్లారు. ఈ క్రమంలో బిల్లులు, ఇందిరమ్మ ఇళ్ల విషయమై మాటామాట పెరిగి పరస్పరం దాడి చేసుకున్నారు. దాడిలో కరుణాకర్ గాయపడినట్లు గ్రామస్తులు తెలిపారు. పాతకక్షల నేపథ్యంలో కరుణాకర్‌పై దాడికి పాల్పడినట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. గాయపడిన కరుణాకర్ గద్వాల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దాడి విషయమై గద్వాల డీఎస్పీ, మల్దకల్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కరుణాకర్ తెలిపారు. అదే విధంగా మరో వర్గం వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇరువురు ఫిర్యాదుల పరిశీలించి కేసు నమోదు చేస్తానని ఎస్ఐ నందికర్ పేర్కొన్నారు.

ఐఎఫ్‌టీయూ సభలను జయప్రదం చేయండి



వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

రాజోళి: కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను తుంగలో తొక్కి కార్మికుల కడుపు కొడుతుందని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి జమ్మిచేడు కార్తీక్ అన్నారు. శాంతినగర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చట్టాలను సవరించి, ధనవంతులకు అనుకూలంగా మార్చారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలతో చిరు ఉద్యోగులు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు నష్టపోతున్నారన్నారు. జూలై 2న గద్వాలలోని వాల్మీకి భవనంలో జరిగే నాల్గవ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో శ్రీరాములు, ఇంద్రానాయక్, వెంకటేష్, కురుమన్న, ఏసన్న, సుధాకర్ పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలలో సమస్యలు పరిష్కరించాలి



టాయిలెట్‌ను పరిశీలిస్తున్న ఐద్వా సంఘం సభ్యులు

గట్టు: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఐద్వా సంఘం జిల్లా కార్యదర్శి నర్మద విద్యాశాఖ అధికారులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం గట్టులోని పాఠశాలను ఐద్వా సంఘం నాయకులు సందర్శించి, విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేవని, చెట్ల కింద కూర్చొని చదువుకునే పరిస్థితి నెలకొందన్నారు. బాలికలకు సరైన టాయిలెట్లు లేవన్నారు. రెండేళ్ల క్రితం ప్రారంభించిన అదనపు గదుల నిర్మాణ పనులు ఇప్పటికి పునాదులకే పరిమితమైనట్లు మండిపడ్డారు. అదే విధంగా ఉపాధ్యాయుల కొరత ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు జయమ్మ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు వేశారు.. మట్టి మరిచారు



సీసీరోడ్డుకు ఇరువైపులా ఏర్పడిన గుంతలు

ఇటిక్యాల: మండల కేంద్రంలో రూ.3 కోట్ల నిధులతో సీసీరోడ్డు నిర్మించి నెలలు గడుస్తున్నా రోడ్డుకు ఇరువైపులా మట్టి వేయడాన్ని మరిచారు సదరు కాంట్రాక్టర్. దీంతో తరచూ ప్రమాదాలకు గురవుతున్నట్లు వాహనదారులు వాపోతున్నారు. సీసీరోడ్డు నిర్మాణ పనులను కాంట్రాక్టర్ యుద్ధ ప్రాతిపదికన ఇటీవల పూర్తి చేశారు. కానీ రోడ్డు సైడ్ బర్మ్‌లకు మట్టిని (మొరం) వేయకపోవడంతో రోడ్డుకు ఇరువైపులా గుంతలు పడి ప్రమాదాలు జరుగుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహనాలు సైడ్ తీసుకున్న క్రమంలో అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నట్లు వాహనదారులు పేర్కొంటున్నారు. అదే విధంగా భారీ వాహనాల రాకపోకలతో రోడ్డు పగుళ్లిచ్చి ధ్వంసమవుతుందన్నారు. దీనిపై రోడ్లు, భవనాల శాఖ ఏఈ రాజేశ్వరిని సాక్షి వివరణ కోరగా.. వారం క్రితమే మట్టిని వేయాలని సదరు కాంట్రాక్టర్‌కు సూచించినట్లు తెలిపారు. రెండు రోజుల్లో రోడ్డుకు ఇరువైపులా మట్టిని వేయించి పనులు పూర్తి చేయిస్తామని పేర్కొన్నారు.

మెరుగైన విద్యను అందించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ భగీరథరెడ్డి

రాజోళి: ఉపాధ్యాయులు విద్యార్థులకు మౌలిక సదుపాయాలతో కూడిన మెరుగైన విద్యనందించాలని ఎంవీ ఫౌండేషన్ వడ్డేపల్లి, రాజోళి మండలాల ఇన్‌చార్జ్‌లు అన్నారు. ఎంవీ ఫౌండేషన్ మండల కోఆర్డినేటర్లు సాయికుమార్, హనిమిరెడ్డి ఆధ్వర్యంలో వడ్డేపల్లి మండల కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు మాట్లాడుతూ.. కిశోర బాలికల గురించి నిర్వహించిన సమావేశాల్లో తీసుకునే నిర్ణయాలు తప్పనిసరిగా ఉపాధ్యాయులు ఆచరించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ నర్సింహులు, భగీరథరెడ్డి, నర్సింహ, కిషోర్, బాలికల సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

'నీళ్లను తరలించుకుపోయింది నిరంజన్‌రెడ్డే'



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

అమరచింత: నీళ్లను తరలించుకొనిపోయి తమ ప్రాంత రైతులకు మోసం చేసిన ఘనత మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డికే దక్కుతుందని డీసీసీ ప్రధాన కార్యదర్శి అయూబ్‌ఖాన్ తెలిపారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ గాయకుడు సాయిచంద్ వర్ధంతి, విగ్రహ ఆవిష్కరణకు హాజరైన మాజీ మంత్రి సాయిచంద్ బీఆర్ఎస్‌కు చేసిన సేవలను కీర్తించకుండా.. కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేసేందుకు వేదికను ఉపయోగించుకోవడం దౌర్భాగ్యమన్నారు. పదేళ్లు అధికారంలో ఉండి జూరాల ప్రాజెక్టు వద్ద తట్టెడు ఒండ్రుమట్టిని సైతం తొలగించని వాళ్లు కేవలం 19 నెలల కాంగ్రెస్ పాలన గురించి విమర్శలు చేయడం అవివేకమన్నారు. జూరాల క్రస్ట్‌గేట్ల రోప్‌లు బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడే తెగిపోయాయని, కృష్ణ పుష్కరాల సమయంలో జూరాల బ్యాక్‌వాటర్‌ను గేట్ల ద్వారా ఎత్తి కిందకు వదిలే సమయంలో తెగిపడినా పట్టించుకోలేదని ఆరోపించారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులపై దృష్టి మళ్లించి, రైతులకు సాగునీటిని అందిస్తూ ముందుకు వెళ్తుందన్నారు. జూరాల ప్రాజెక్టును సందర్శించి వాటి మరమ్మతులతో పాటు సమీపంలో వంతెన నిర్మాణానికి రూ.300 కోట్లను సీఎం రేవంత్‌రెడ్డి మంజూరు చేసినట్లు తెలిపారు. నియోజక వర్గ అభివృద్ధిపై ఏనాడు దృష్టి సారించని మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి నేడు తమ ప్రభుత్వంపై విమర్శలు చెయ్యడం తగదన్నారు. సమావేశంలో కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు అరుణ్‌కుమార్, మహేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు తిరుమలేష్, మహంకాళి విష్ణు, తౌఫిక్, ప్రకాశం, శ్యాం, హనుమంతునాయక్, పోసిరిగారి విష్ణు, రవికాంత్, రాకేష్‌గౌడ్ పాల్గొన్నారు.

క్రీడాకారిణికి అభినందన



ఆత్మకూర్: షూటింగ్ చాంపియన్‌షిప్ 2025 పోటీల్లో కాంస్య పతకం సాధించిన మండలంలోని ఆరేపల్లికి చెందిన మౌనికను రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి అభినందించారు. మౌనిక కీసరలోని మహాత్మజ్యోతిరావ్‌పూలే గురుకులంలో ఇంటర్ సెకండియర్ చదువుతూ షూటింగ్ పోటీల్లో కాంస్య పతకం సాధించడం తమ ప్రాంతానికే గర్వకారణని కొనియాడారు. మౌనికకు రాష్ట్ర ప్రభుత్వం తరుపున అండగా నిలుస్తామని, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే విధంగా రవాణా, రైఫిల్, ఇతర సౌకర్యాలను కల్పిస్తామని భరోసానిచ్చారు. రామచంద్రయ్య, వెంకటన్న, మోహన్, బాలయ్య, రాజు పాల్గొన్నారు.